నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, మంగళవారం 22 అక్టోబర్ 2024 | HYDERABAD

24, 25న నీటి సరఫరా బంద్

సిటీబ్యూరో, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహానగరానికి తాగునీరు సరఫరా చేసే కృష్ణా డ్రింకింగ్ వాటర్ సప్లయి ఫేస్-3లోని 2375 ఎంఎం డయా ఎంఎస్ పంపింగ్ మెయిన్‌కు లీకేజీ ఏర్పడింది. దీనిని అరికట్టడానికి మరమ్మతు పనులు చేయనున్నారు. వీటిని ఈ నెల 24వ తేదీ (గురువారం) ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజు 25వ తేదీ శుక్రవారం సాయంత్రం ఆరు గంటల వరకు పనులు చేపట్టనున్నారు. ఈ 24 గంటలు పలు రిజర్వాయర్ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో ఆటంకం ఏర్పడుతుందని అధికారులు పేర్కొన్నారు.

అంతరాయం ఏర్పడే ప్రాంతాలు

శాస్త్రిపురం, బండ్లగూడ, భోజగుట్ట, షేక్‌పేట, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, ప్రశాసన్‌నగర్, తట్టిఖానా, లాలాపేట్, సాహేబ్‌నగర్, ఆటోనగర్, సరూర్‌నగర్, వాసవీ రిజర్వాయర్లు, సైనిక్‌పురి, మౌలాలి, గచ్చిబౌలి, మాదాపూర్, అయ్యప్ప సొసైటీ, కావూరి హిల్స్, స్నేహపురి, కైలాసగిరి, దేవేంద్రనగర్, మధుబన్, దుర్గానగర్, బుద్వేల్, సులేమాన్ నగర్, గోల్డెన్ హైట్స్, 9 నంబర్, కిస్మత్‌పూర్, పెద్ద అంబర్‌పేట తదితర ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు.

గ్రూప్- 1 మెయిన్స్.. 87.23%

సిటీబ్యూరో: గ్రూప్- 1 మెయిన్స్ పరీక్ష మొదటిరోజు సోమవారం ప్రశాంతంగా సాగింది. అక్కడక్కడ అభ్యర్థులు ఆలస్యంగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవడంతో వారిని సిబ్బంది లోపలికి అనుమతించలేదు. దీంతో కొందరు అభ్యర్థులు కన్నీటి పర్యంతమయ్యారు. హైదరాబాద్ జిల్లాలో 87.23 శాతం మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. మధ్యాహ్నం 1:30 గంటల తర్వాత అభ్యర్థులను లోపలికి అనుమతించలేదు. కాగా, పరీక్షా కేంద్రాలను హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సందర్శించి అక్కడ ఏర్పాట్లపై ఆరా తీశారు.

పరీక్షా కేంద్రాలను హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సందర్శించి.. ఏర్పాట్లపై ఆరా తీశారు

చైన్‌మెన్లకు స్థాన చలనం

శేరిలింగంపల్లి జోన్‌లో సమూల ప్రక్షాళన చేసిన జెడ్సీ

కావూరి హిల్స్ ఫేస్- 2 రోడ్డులో నిర్మించిన అక్రమ నిర్మాణానికి నోటీసులు

సిటీబ్యూరో: ఏండ్ల తరబడి ఒకే సర్కిల్‌లో పాతుకుపోయిన పట్టణ ప్రణాళికా విభాగం చైన్‌మన్లకు ఎట్టకేలకు స్థానచలనం కలిగింది. మాదాపూర్ కావూరిహిల్స్ ఫేస్- 2 రోడ్డులోని దాదాపు 1000 గజాల స్థలంలో ఓ వ్యాపారస్తుడు సెకండ్ హ్యాండ్ కార్ సేల్స్ వ్యాపారం కోసం అక్రమంగా షెడ్డు వేసుకోగా..ఆ వ్యాపారి నుంచి భారీగా ముడుపులు తీసుకున్నారన్న ఆరోపణలు.. జోన్‌లో మిగతా చైన్‌మెన్లు అక్రమ నిర్మాణాల నుంచి అందినంద దండుకుంటున్నారన్న ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి చర్యలకు ఉపక్రమించారు. కావూరి హిల్స్ ఫేస్- 2 రోడ్డులోని దాదాపు 1000 గజాల స్థలం విషయంలో ఏర్పాటు చేసిన షెడ్డు వ్యవహారంపై డీసీ, ఏసీపీలతో విచారణ జరిపించిన జెడ్సీ సమూల ప్రక్షాళన చేశారు. శేరిలింగంపల్లి జోన్ వ్యాప్తంగా సర్కిళ్లలో పట్టణ ప్రణాళికా విభాగంలో పనిచేస్తున్న చైన్‌మన్లను బదిలీ చేస్తూ జోనల్ అధికారులు సోమవారం ఆదేశాలు చేశారు. శేరిలింగంపల్లి సర్కిల్‌లో పనిచేస్తున్న చైన్‌మన్లలో లక్ష్మీనారాయణను యూసుఫ్‌గూడ సర్కిల్‌కు , జావీద్‌ను చందానగర్ సర్కిల్‌కు, చందానగర్ సర్కిల్‌లో పని చేస్తున్న ఐలయ్య, కుమారస్వామిని పటాన్‌చెరు సర్కిల్‌కు, పటాన్‌చెరు సర్కిల్‌లో పని చేస్తున్న మల్లేశ్‌ను శేరిలింగంపల్లి సర్కిల్‌కు , రాజేందర్‌ను చందానగర్ సర్కిల్‌కు బదిలీ చేశారు. చందానగర్ సర్కిల్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ ప్రవీణ్‌కుమార్‌ను పటాన్‌చెరు సర్కిల్‌కు బదిలీ చేయగా, వీరందరినీ తక్షణమే రిలీవ్ చేయాలని జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి ఆదేశించారు.కొందరు చైన్‌మన్లు ఆయా స్థానాల్లో కేటాయించిన కొత్త సర్కిళ్లలో రిపోర్ట్ చేశారు. కాగా, కావూరి హిల్స్ ఫేస్- 2 రోడ్డులోని దాదాపు 1000 గజాల స్థలంలో అనుమతి లేకుండా షెడ్డు నిర్మాణం జరుగుతున్నది. సదరు నిర్మాణదారుడికి టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు నోటీసులు జారీ చేశారు. అయితే నోటీసులు అందుకున్న సదరు యజమాని సోమవారం కూడా పనులు జరిపినట్లు తెలుస్తున్నది.

నమస్తే ఎఫెక్ట్

జీహెచ్ఎంసీ VS హైడ్రా

రెండు శాఖల మధ్య కోల్డ్ వార్

- ఫైర్ డిపార్ట్‌మెంట్ హైడ్రా ఆధీనంలోనే..
- ఎన్‌వోసీల జారీలో గందరగోళం
- అనుమతులు ఇచ్చేది బల్దియా.. హైడ్రా కేంద్రంగా తనిఖీలు
- నిర్మాణదారులకు తప్పని ప్రదక్షిణలు
- 'బల్దియా' గొడుగు కిందే ఫైర్ డిపార్ట్‌మెంట్ పనిచేస్తే సులువుగా ఉంటుందన్న అభిప్రాయం
- కొత్త కమిషనర్ నిర్ణయంపై ఎదురుచూపులు

జీహెచ్ఎంసీ వర్సెస్ హైడ్రాల మధ్య కోల్డ్ వార్ కొనసాగుతున్నది.. విజిలెన్స్ విభాగం తరహాలోనే ఫైర్ డిపార్ట్‌మెంట్‌ను తమ ఆధీనంలోకి తీసుకున్న హైడ్రా..జీహెచ్ఎంసీ అధికారాల విషయంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నది. ఫలితంగా నిర్మాణ రంగ అనుమతుల జారీలో కీలకమైన ఫైర్ ఎన్‌వోసీల జారీలో అంతా గందరగోళం నెలకొంది..నిర్మాణ రంగ అనుమతులు ఒకే గొడుగు కింద నుంచి వెళ్లాలి..కానీ జీహెచ్ఎంసీలో చలాన్లు కట్టిన దరఖాస్తులకు హైడ్రా కేంద్రంగా తనిఖీలు జరిపి సంబంధిత నిర్మాణానికి అనుమతులు మంజూరవుతున్నాయి. ఇప్పటికే జీహెచ్ఎంసీ, హైడ్రా అధికారుల అంతర్గత కోల్డ్‌వార్ కొనసాగుతుండగా...ఫైర్ ఎన్‌వోసీల పొందాలనుకునే వారికి రెండు శాఖల చుట్టూ ప్రదక్షిణలు తప్పడం లేదు.

-సిటీబ్యూరో, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ)

హైడ్రా ఏర్పాటు కంటే ముందు జీహెచ్ఎంసీ ఆధీనంలో ఈవీడీఎం విభాగం ఉంది. ఈవీడీఎం డైరెక్టర్ కింద విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌తో పాటు అడ్వర్టయిజ్‌మెంట్ విభాగాలు ఉన్నాయి. హైడ్రా ఏర్పాటు తర్వాత జీహెచ్ఎంసీ యాక్ట్ ప్రకారం డిజాస్టర్ మేనేజ్‌మెంట్ తప్ప..మిగతా విభాగాలన్నీ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆధీనంలోనే పనిచేయాలి. కానీ హైడ్రా కమిషనర్ దూకుడుగా వ్యవహరించి జీహెచ్ఎంసీ అధికారాలను తమ గుప్పిట్లోనే పెట్టుకునే ప్రయత్నం చేశారు. ఇందుకు విజిలెన్స్ విభాగానికి చెందిన అధికారులు, ఉద్యోగులే నిదర్శనం. విజిలెన్స్‌కు సంబంధించిన కానిస్టేబుళ్లు, ఎస్ఐ, సీఐ, ఏసీపీలు బల్దియాలోకి రిపోర్టు చేయాలి. కానీ దాదాపు నెల రోజులు దాటినా.. జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్‌కు విజిలెన్స్ టీం రిపోర్టు చేయలేదు. జీహెచ్ఎంసీకి చెందిన విజిలెన్స్ అధికారులు హైడ్రా కమిషనర్ ఆఫీసులోనే ఉద్యోగాలు చేస్తూ వచ్చారు. వీరు జీతం మాత్రం బల్దియాలోనే తీసుకుంటూ హైడ్రా కార్యాలయంలో ఎలా పనిచేస్తారంటూ అప్పటి కమిషనర్ ఆమ్రపాలి మందలించారు. ఆమె మందలింపుతో వెంటనే విజిలెన్స్ టీం జీహెచ్ఎంసీలో రిపోర్టు చేసి ప్రస్తుతం పనిచేస్తున్నారు. ఈ తరహాలోనే ఇప్పుడు ఫైర్ విభాగం సిబ్బంది కూడా జీహెచ్ఎంసీలోనే పనిచేయాల్సి ఉంది. ఎందుకంటే నిర్మాణ రంగ అనుమతుల జారీ ఒకే కేంద్రంగా కొనసాగాలి..కానీ డిజాస్టర్ పేరిట హైడ్రాలోనే ఫైర్ విభాగం అధికారులు (ఎస్ఎఫ్ఓలు ఐదుగురు, డీఎఫ్ఓలు రెండు, ఆర్ఎఫ్ఓలు రెండు)పనిచేస్తున్నారు.

రెండు శాఖల చుట్టూ ప్రదక్షిణలు

వాస్తవంగా 15 మీటర్ల లోపు నిర్మాణ రంగ అనుమతుల ప్రక్రియలో భాగంగా జీహెచ్ఎంసీలో ఫైర్ ఎన్‌వోసీకి సంబంధించి చలాన్ (క్యాష్) చెల్లించిన నిర్మాణదారులకు ఒకే గొడుగు కింద సేవలు అందాలి. కానీ జీహెచ్ఎంసీలో చలాన్ కడితే జారీ మాత్రం హైడ్రా కేంద్రంగా ఉన్న ఫైర్ విభాగం అధికారుల పరిశీలన అనంతరం ప్రొవిజినల్ సర్టిఫికెట్ (ఫైర్ ఎన్‌వోసీ సర్టిఫికెట్) తీసుకోవాల్సి వస్తున్నది. దీంతో రెండు శాఖల చుట్టూ నిర్మాణదారుడికి ప్రదక్షిణలు తప్పడం లేదు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆధీనంలోనే ఫైర్ డిపార్ట్‌మెంట్ విభాగం పనిచేస్తే ఈ జాప్యం తగ్గి నిర్మాణదారులకు సులువుగా ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొత్త కమిషనర్ దృష్టి సారించి విజిలెన్స్ విభాగం తరహాలోనే ప్రత్యేకంగా ఫైర్ సిబ్బందిని జీహెచ్ఎంసీకి తీసుకువచ్చి ఒకే గొడుగు కింద సేవలు పొందేలా చొరవ తీసుకోవాలన్న డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి.

సార్.. కరెంటు?

గ్రేటర్‌లో ఫిర్యాదుల వెల్లువ

పట్టించుకోని టీజీఎస్‌పీడీసీఎల్

వినియోగదారుల ఆగ్రహం

సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్‌లో డిమాండ్‌కు సరిపడా విద్యుత్ అందుబాటులో ఉన్నా.. ఎక్కడ చూసినా సరఫరాలో అంతరాయలే కనిపిస్తున్నాయి. ఎప్పుడు పడితే అప్పుడు.. కరెంటు పోవడం.. రావడం అనేది నిత్యకృత్యంగా మారింది. ప్రకటిత విద్యుత్ కోతలు లేకున్నా.. అప్రకటిత విద్యుత్ అంతరాయాలు మాత్రం నిత్యం ప్రతి సర్కిల్‌లోనూ షరామామూలే అన్నట్లుగా మారింది. కొందరు వినియోగదారులు సోషల్ మీడియా వేదికగా విద్యుత్ అంతరాయాలపై ఫిర్యాదు చేస్తుంటే.. మరి కొందరు నేరుగా విద్యుత్ శాఖ కాల్ సెంటర్‌కు ఫోన్ చేస్తున్నారు. స్థానికంగా ఉండే సెక్షన్ ఏఈ, లైన్ ఇన్‌స్పెక్టర్లకు సైతం చేసే ఫిర్యాదులు లెక్కలేనన్ని వస్తున్నాయి. తాజాగా సోమవారం కూకట్‌పల్లి ప్రాంతంలోని ఎల్లమ్మబండ కమలమ్మ కాలనీ నుంచి ఓ వ్యక్తి రెండు గంటలుగా కరెంటు నిలిచిపోయిందంటూ టీజీఎస్‌పీడీసీఎల్‌కు ఎక్స్ వేదికగా ఫిర్యాదు చేశారు. బండ్లగూడలో రోజూ విద్యుత్ అంతరాయం ఉంది. తరచూ అంతరాయాలతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారని మరో విద్యుత్ వినియోగదారుడు పోస్టు చేశారు. ఇలా ప్రతి రోజూ ట్విట్టర్ వేదికగానే పదుల సంఖ్యలో విద్యుత్ అంతరాయాలపై ఫిర్యాదులు వస్తుండగా, ఇక కాల్ సెంటర్‌కు నేరుగా వచ్చేవి, స్థానికంగా ఉండే అధికారులకు, సిబ్బంది చేసే ఫిర్యాదులు లెక్కలేనన్ని ఉంటున్నాయి.

లోపమంతా నిర్వహణ వ్యవస్థలోనే...

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో 15 జిల్లాలు ఉండగా, అందులో అత్యంత కీలకమైంది గ్రేటర్ పరిధి. ఇందులో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల పరిధుల్లో పట్టణ ప్రాంతాలు ఉన్నాయి. ఈ జిల్లాల్లోనే మొత్తం 10 సర్కిళ్లను ఏర్పాటు చేసి, వాటిని గ్రేటర్ పరిధిగా పరిగణిస్తున్నారు. ఈ పరిధిలో హైదరాబాద్ సెంట్రల్, హైదరాబాద్ సౌత్‌తో పాటు సికింద్రాబాద్, సైబర్ సిటీ, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, హబ్సిగూడ, మేడ్చల్, సంగారెడ్డి సర్కిళ్ల ద్వారా క్షేత్ర స్థాయిలో విద్యుత్ సరఫరా వ్యవస్థను నిర్వహిస్తున్నారు. దక్షిణ డిస్కంలో మొత్తం కోటి 10 లక్షల కనెక్షన్లు ఉంటే అందులో గ్రేటర్‌లోనే 68 లక్షలకు పైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటన్నింటికీ నిరంతరం అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసే విద్యుత్ నెట్ వర్క్ ఉన్నా.. దాని నిర్వహణ,సకాలంలో మరమ్మతు చేపట్టకపోవడంతో అంతరాయాలు తలెత్తున్నాయి. క్షేత్ర స్థాయిలో నెట్‌వర్క్‌ను బలోపేతం చేసేందుకు యంత్రాంగం అప్రమత్తంగా ఉండి పని చేయాల్సి ఉన్నా, ఆదిశగా నిర్వహణ లేదు.

నిరసన తెలుపుతున్న రాజీవ్ రహదారి ఆస్తుల యజమానుల జాయింట్ యాక్షన్ కమిటీ

100 అడుగులు చాలు..

మారేడ్‌పల్లి/బొల్లారం: రాజీవ్ రహదారి రోడ్డును 200 అడుగులకు విస్తరించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా రాజీవ్ రహదారి ఆస్తుల యజమానుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) కన్వీనర్ సతీశ్ గుప్తా ఆధ్వర్యంలో సోమవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ సికింద్రాబాద్ క్లబ్ నుంచి తిరుమలగిరి క్రాస్ రోడ్డు వరకు కొనసాగింది. ఈ సందర్భంగా సతీశ్ గుప్తా మాట్లాడుతూ...ప్రభుత్వం తన నిర్ణయాన్ని పున:పరిశీలించాలని, ప్రతిపాదిత రహదారి విస్తరణను 200 అడుగుల నుంచి 100 అడుగులకు తగ్గించాలన్నారు.జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, కొండాపూర్, మాదాపూర్, గచ్చిబౌలి, హిమాయత్‌నగర్, బేగంపేట, అబిడ్స్, నాంపల్లి వంటి అనేక ప్రధాన ప్రాంతాలు 100 అడుగుల రోడ్లతో సమర్థవంతంగా ఉన్నాయని తెలిపారు. రాజీవ్ రహదారి మార్గంలో ఫ్లైఓవర్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు 100 అడుగులు సరిపోతాయని పేర్కొన్నారు. అభివృద్ధికి వ్యతిరేకం కాదన్నారు.

ట్రయల్ రన్‌లోనే ఓటీఎస్

సిటీబ్యూరో, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ ఆదేశాల అమలులో జలమండలి అధికారులు మొద్దు నిద్ర వీడటం లేదు. మొండి నీటి బకాయిదారులకు లబ్ధి జరిగేలా ఓటీఎస్ జీవో వెలువడి 17 రోజులు దాటినా.. వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు నానా తంటాలు పడుతున్నారు. జీవో వచ్చినా.. అమలేదీ అన్న శీర్షికతో 'నమస్తే తెలంగాణ'లో అధికారుల లోపాలను ఎత్తిచూపుతూ ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఈ నేపథ్యంలోనే అధికారులు రోజంతా ఓటీఎస్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు తీవ్ర కసరత్తు చేశారు. సంస్థ ఎండీ, ఈడీలు, రెవెన్యూ విభాగం అధికారులతో కలిసి అన్ని డివిజన్ల జీఎంలతో సమీక్షలు జరిపారు. ఓటీఎస్ అర్హుల ఎంపికపై తీవ్రంగా కసరత్తు చేసి 6.90 లక్షల మంది అర్హులు అని తేల్చారు. మొత్తంగా డొమిస్టిక్, డొమిస్టిక్ స్లమ్, కమర్షియల్, ఇండస్ట్రీయల్, ఎంఎస్‌బీ, బల్క్, కాలనీలు, ప్రభుత్వ, కేంద్ర రంగ సంస్థలు కలిపి ఓటీఎస్ స్కీం వర్తింపజేయగా..వీటీ నుంచి రూ.2650 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా చేశారు. ఓటీఎస్ జీవో గడువు మరో తొమ్మిది రోజుల్లో ముగుస్తున్నది. అయితే జీఎంలకు డివిజన్ల వారీగా అర్హుల జాబితా, యాప్ విధానం అమలుపై అవగాహన కల్పించిన అధికారులు.. మంగళవారం (నేటి) నుంచి వినియోగదారుల ఫోన్లకు ఎస్ఎంఎస్‌లకు పంపనున్నారు.

డీఈవో తీరుపై టీచర్ల గుస్సా!

ఎంతా నా ఇష్టం..

సిటీబ్యూరో: పోస్టింగ్ ఇచ్చిన నాలుగు రోజులకే బదిలీ చేస్తామంటూ డీఈఓ నుంచి ఫోన్లు వస్తుండటంతో కొత్తగా పోస్టింగ్‌ల్లో చేరిన టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టుమని వారం గడవక ముందే బదిలీపై మరో ప్రాంతంలో రిపోర్ట్ చేయాలని డీఈఓ కార్యాలయం నుంచి పలువురికి ఫోన్లు వస్తున్నాయి. సోమవారం కొందరిని కార్యాలయానికి సైతం డీఈఓ పిలిపించుకుని మరో ప్రాంతానికి వెళ్లాలంటూ ఆదేశాలు ఇచ్చారు. దీంతో వాళ్లంతా ఉపాధ్యాయ సంఘాలను కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. కుటుంబంతో కలిసి పోస్టింగ్ ఇచ్చిన ప్రాంతంలో ఇండ్లు తీసుకునే పనిలో వారుంటే ఇప్పుడు అకస్మాత్తుగా వెనక్కి పిలిచి.. మరో ప్రాంతానికి వెళ్లాలంటూ డీఈఓ చెబుతున్నారని ఓ మహిళా టీచర్ ఆవేదన వ్యక్తం చేశారు. మరో టీచర్‌ను పిలిపించి లంగర్‌హౌజ్ నుంచి ఆసిఫ్‌నగర్‌లో పోస్టు కేటాయిస్తున్నట్టు డీఈఓ ఆదేశాలివ్వడంపై సదరు టీచర్ నిరసన వ్యక్తం చేశారు.

కౌన్సెలింగ్‌లో అక్రమాలు!

డీఎస్సీ కౌన్సెలింగ్‌లో అవకతవకలు జరిగాయనడానికి ఆకస్మిక బదిలీ ప్రక్రియనే కారణమని ఉపాధ్యాయ సంఘాలు పేర్కొంటున్నాయి. ఈనెల 22న జరిగిన కౌన్సెలింగ్ ప్రక్రియ కూడా పారదర్శకంగా జరగలేదని ఆరోపించాయి. అవసరం ఉన్న దగ్గర టీచర్లను కేటాయించకుండా అవసరం లేని చోట టీచర్లను కేటాయించారు. బహదూర్‌పుర-2 మండలంలోని జీపీఎస్ నంది ముసలాయిగూడ

పోస్టింగ్ ఇచ్చిన నాలుగు రోజులకే బదిలీ..!

పాఠశాలలో 68 మంది విద్యార్థులు ఉండగా, త్వరలో రిటైర్డ్ కాబోయే ఒక్క టీచర్ మాత్రమే ఉన్నారు. ఇక్కడ ఇంకా ఇద్దరు టీచర్స్ అవసరం ఉంది. కానీ ఒక్క పోస్టు కూడా కేటాయించలేదు. వెకెన్సీలకు ప్రాధాన్యత నివ్వకుండా డీఈఓ పోస్టింగ్‌లు కేటాయించారు. గులాబ్ సింగ్‌లో 40 మంది విద్యార్థులకు ఒక్క టీచర్ కూడా లేరని ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి. జీపీఎస్ సాయిబాబానగర్ పాఠశాలలో 160 మంది విద్యార్థులకు ఒక హెచ్ఎం, 5గురు ఎస్జీటీలు ఉన్నప్పటికీ అవసరం లేకపోయినా అదనపు పోస్టు చూపించారంటూ టీఎస్‌యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి శ్యామ్‌సుందర్ ఆరోపించారు. ఇలా నగరంలో చాలా స్కూల్లో పరిస్థితి ఇలానే ఉండటం బాధాకరమని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇష్టానుసారంగా ప్రక్రియ..

డీఈఓ రోహిణి అంతా నా ఇష్టం అన్నట్టుగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తున్నది. గతంలో విధుల్లో అలసత్వం ప్రదర్శించినందుకు డీఈఓ రోహిణికి హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి షోకాజ్ నోటీసులు సైతం జారీ చేయడం తెలిసిందే. ఇప్పుడు అత్యంత ముఖ్యమైన టీచర్ల భర్తీలోనూ అదే అలసత్వం ప్రదర్శించినట్టు తెలిసింది. హైదరాబాద్‌లో డీఎస్సీ - 2024లో 584 మంది అభ్యర్థులకు పోస్టింగ్ ఇచ్చారు. 878 పోస్టులకు గాను కోర్టు కేసులు, రిజర్వేషన్ కేటగిరీలో అభ్యర్థుల కొరత, ఇన్ సర్వీస్ తదితర కారణాలతో 262 పోస్టులు పెండింగ్‌లో ఉన్నాయి. మిగతా 616 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసినప్పటికీ ధ్రువీకరణ పత్రాల రీ వెరిఫికేషన్‌తో 32 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు నిలిపి వేసిన విషయం తెలిసిందే. నియామక పత్రాలు అందుకున్న వారిలో 386 ఎస్జీటీ, 107 ఎస్ఏ, 91 ఎల్‌పీ అభ్యర్థులకు పోస్టింగ్‌లు లభించాయి. వీరిని అవసరమున్న చోట భర్తీ చేయకుండా ఇష్టానుసారంగా ప్రక్రియ పూర్తి చేశారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు ఇప్పుడు బదిలీకి ఒత్తిడి తీసుకొస్తుండటం విశేషం.

ట్రాఫిక్.. టెన్షన్

ఆ రూట్లలో వెళ్లాలంటే గుండె దడే

బాబోయ్.. ఇదేం ట్రాఫిక్.. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ట్రాఫిక్ రద్దీ ఉండటంతో నగరవాసులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ జటిలమవుతున్నది. కనీసం అంబులెన్స్ వెళ్లాలన్నా కష్టంగా మారుతున్నది. అర కిలోమీటరు దూరానికి కూడా అరగంటపైనే పడుతున్నది. కీలకమైన సమయాల్లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాల్సిన పోలీసులు ఎక్కడా కనిపించడం లేదు. వాహనాల వలయాన్ని ఛేదించే వ్యూహాన్ని అమలు చేయడం లేదు. ఫలితంగా నగరంలో ట్రాఫిక్ జంఝాటం ప్రయాణికులకు చుక్కలు చూపిస్తున్నది.

సిటీబ్యూరో: ట్రాఫిక్.. ట్రాఫిక్... ఇది నగరవాసులను ప్రతి రోజూ తీవ్ర టెన్షన్‌కు గురిచేస్తున్నది. ఉదయం, సాయంత్రం అయితే నగరంలోని కేబీఆర్ పరిసర ప్రాంతాల్లోని రోడ్ల వెంబడి ప్రయాణించాలంటే నరకమే. బంజారాహిల్స్‌లోని పెన్షన్ హౌస్ చౌరస్తా దాటాలంటే 5 నుంచి 10 నిమిషాల సమయం పడుతున్నది. రోడ్డు నంబర్. 10లో రోడ్లు చిన్నవిగా, మరికొన్ని చోట్ల మరింత ఇరుకుగా ఉండటంతో ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతున్నది. దీంతో ఉదయం.. సాయంత్రం వేళల్లో నగర రోడ్లపై ట్రాఫిక్ రద్దీ విపరీతంగా ఉంటున్నది. రద్దీ తగ్గించే చర్యలు లేకపోవడంతో గంటల తరబడి రహదారులపై ఉండాల్సిన దుస్థితి ఏర్పడుతున్నది.

'దుర్గం' వంతెనతో తీరిన కష్టాలు

సైబరాబాద్‌లోని ఐటీ కారిడార్‌కు వెళ్లే వారికి దుర్గంచెరువు వంతెనతో కష్టాలు తీరాయి. ఐటీ కారిడార్‌లోకి వెళ్లే వాహనదారులు ఈ రూట్ నుంచే వెళ్లేందుకు ఉత్సాహం చూపుతారు. అలాగే జూబ్లీహిల్స్ చెక్‌పోస్టుతో పాటు మెహిదీపట్నం నుంచి ఐటీ కారిడార్‌కు వెళ్లి వస్తుంటారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో పలు సంస్థలు ఉండటంతో ఇక్కడికి వచ్చిపోయే వారి సంఖ్య ప్రతి నిత్యం ఎక్కువగా ఉంటున్నది. వీఐపీల మూమెంట్ కూడా ఉంటుంది. ఈ నేపథ్యంలో కేబీఆర్ చుట్టుపక్కలతో పాటు రోడ్డు నం. 1, 2, 10, 12, 45 జంక్షన్లతో పాటు మాసబ్‌ట్యాంక్ ఫ్లైఓవర్ జంక్షన్, మెహిదీపట్నం ప్రాంతాల్లో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది.

ఈ మార్గాల్లో రద్దీ విపరీతం..

ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు బంజారాహిల్స్‌లోని రోడ్లన్నీ వాహనాలతో నిండి ఉంటున్నాయి. కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ముందు నుంచి వీరంచి జంక్షన్‌కు వచ్చే రూట్‌లో వాహనాలు కిలోమీటర్ పొడవునా.. బారులు తీరి ఉంటాయి. కేబీఆర్ పార్కు నుంచి రోడ్డు నంబర్ .10 మీదుగా సిటీ సెంటర్ జంక్షన్‌కు వెళ్లే మార్గంలో పరిస్థితి దారుణంగా ఉంటుంది. రాత్రి 10 గంటల తరువాత నగరంలోకి రావాల్సిన భారీ వాహనాలు 9 గంటల వరకే వస్తుంటాయి. దీంతో అప్పటికే బంజారాహిల్స్ పరిసరాల నుంచి వచ్చి పంజాగుట్ట, లక్డీకాపూల్ రూట్లలో నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లేవారికి అక్కడ కూడా కనీస ఉపశమనం ఉండటం లేదంటూ వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.